# మా తాతత్త-వైరం

-చామర్తి ఆచార్య

పెద్ద పండక్కి మా తాతగారింట ఓ పదిహేను మంది పిల్లలం పోగయ్యేవాళ్ళం. ఆ ఏడాది పండక్కి మా తాతత్త అదనపు ఆకర్షణ అయింది. తాతత్త అంటే మా తాతారికి అత్తగారు. 'ముని అమ్మమ్మ' అనటం కష్టంగా ఉందని చెప్పి ఈ సులువుని కనిపెట్టాం. ఇంతాచేసి, అసలావిణ్ని చూడటం ఇదే మొదటిసారి మాకందరికీ.

పిల్లలందర్లోకీ నేను, మా తమ్ముడు, నారదుడు బావ హైస్కూల్ వాళ్ళం. తక్కిన సత్రకాయలంతా ఎలిమెంటరీ వాళ్ళు. రాత్రిపూట అంతా పక్కలెక్కాక మా తాతత్త కాశీ మజిలీ కథల్ని మొదలెట్టేది. పిల్లల్తో పాటు పెద్దాళ్ళు కూడా ఒకటే శ్రద్ధతో వినేవాళ్ళు. అయితే, ఈ ఉత్సాహంలో మా తాతగారు మాత్రం చేరేవారు కాదు. అసలాయనా, ఈవిడా మాటాడుకోడం మేమెవ్వరం చూళ్లేదు. పెద్దాళ్ళకెవరికీ కారణం తెలీక, 'పెద్దాళ్ళ విషయాలు మీకెందుకర్రా?' అనేశారు.

చివరకు ఊరు దిగబెడ్తూ తాతత్తనే దార్లో అడిగితే, 'ఆయన్నే అడగలేకపోయావట్రా?' అని ఊర్కుంది.

మా తాతగారంటే మాక్కొంచెం పక్కబెదురు. అందువల్ల మా నారదుడు బావనీ, తమ్ముణ్ణీ వెంట తీసుకెళ్ళాను.

అదృష్టం కొద్దీ, ఆ రోజు తాతగారు ప్రసన్నంగా ఉన్నారు. పడక్కుర్చీలో పొగాకు పట్టీ నములుతూన్న ఆయన ప్రక్కకి చేరాం.

"తాతయ్యా! మీరు కోంబడనంటే ఓ సందేహం – తాతత్తా మీరూ ఎందుకు మాటాడుకోరూ?" అని అడిగా.

తాతగారు ప్రసన్నంగానే, "నాకావిడపై కోపమని మీకెవరైనా చెప్పారా? ఆవిడకే నాపై కోపం, మాటాడదు. ఎందుకనో ఆవిణ్నే అడగాల్సింది" అన్నారు.

"ఆవిణ్నే అడిగేం తాతయ్యా... కానీ మిమ్మల్నే అడగమంది తాతత్త"

"ఒరే, పెద్దాళ్ళ విషయాలు మీకెందుకర్రా? ఆయన్ని కాస్త రెస్ట్ తీస్కోనివ్వండి" అప్పుడే భోజనం ముగించి వచ్చిన మా అత్త కసురుకుంది.

మా నారదుడు బావకి కోపం వచ్చినట్లుంది. నా వైపు తిరిగి, "అయ్యిందా? ఇహ పద, రెడీ కా. సినిమా కెళ్దాం" అన్నాడు పుల్లవిరుపుగా.

"సినిమాకా? మూడు మైళ్ళు నడిచి, ఆ సింగిల్ ప్రొజక్టర్‌లో సినెమా చూడ్డం కంటే ఇంట్లో కూర్చోటం హాయి" అన్నారు తాతగారు.

"ఔన్రా. పైగా రాత్రి ఆటగ్గానీ మీరు అందరు. వదిలేటప్పటికి అర్ధరాత్రౌతుంది. ఆ తుమ్మపొదలూ, చింతచెట్లు, దొంగయేరూను. దార్లో కొరివిదెయ్యాలు కూడ ఉన్నాయిట!" అందించింది మా అత్త.

మా నారదుడు బావకి దెయ్యాల భయం జాస్తి.

"ఒట్టిదే. దెయ్యాలసల్లేవు" మధ్యలో దూరేడు మా తమ్ముడు. దెయ్యాల్నే కాదు, వాడు దేన్నీ ఓ పట్టాన నమ్మేవాడు కాదు.

ఇంతకీ అసలు విషయం, మా తాతగార్కి సినిమాలంటే గిట్టవు. ఆయన అప్పటివరకు చూసిన ఒకే సినెమా నాగయ్యగారి త్యాగయ్యట. అలాగని ఆయనింట్లో ఉంచిన సాహిత్యం వగైరాలు తక్కువని కావు. షేక్‌స్పియర్ వోల్యూమ్స్ నుంచి టాగూర్ గీతాంజలి ఇంగ్లీష్ వెర్షన్ వరకు ఆయన చదివిన పుస్తకాల దొంతుల్ని అద్దాల బీరువాల్లో చూడొచ్చు.

"దెయ్యాల్ని నేన్నమ్ముతాను" అన్న తాతగార్ని మా తమ్ముడు తప్పించి అందరూ ఉత్సుకతతో చూశారు. తమ్ముడు మాత్రం–

"మీరు చూసేరేంటి?" అన్నాడు.

"ఎలా ఉంటాయవి?" నారదుడు బావ నోరు పెగుల్చుకున్నాడు.

"మీకు నమ్మకం కుదరకపోతే ఓ సంగతి చెబుతా వినండి. మీ తాతత్తకి నామీదున్న వైరంకి కారణం సంగతి ఇది" అని మమ్మల్నందర్నీ కూర్చోబెట్టుకుని చెప్పటం ప్రారంభించేరు తాతగారు.

"మీ తాతత్తకు ఇద్దరు కూతుళ్ళు. రెండో ఆవిడ మీ అమ్మమ్మ – నా భార్య. పెద్దావిడ నాకంటే ఏడాదో ఏణ్ణర్థమో పెద్దది. గొప్ప అసూయ మనిషి. మీ అమ్మమ్మకూ ఆవిడకూ ఐదారేళ్ళ తేడా ఉంటుంది. చెల్లెల్ని ఆడిస్తూ ఆడిస్తూ, "నాకు పోటీకి పుట్టేసేవే", అని ఏడిచేదట. కానీ, ఏ మాటకామాటే చెప్పుకోవాలి. మహా

## 'భూ ప్రళయం'

**భూ** ప్రళయంతో నేల తల్లి గుండె బ్రద్దలైంది
ఫెళ ఫెళా రావాలతో దిక్కులు పిక్కటిల్లేలా
ఆ నేల శోకంతో విశంకితమై పోతుంటే
హృదయ జ్వలనంతో లోకం నిర్ఘాంతపోయింది!
కన్ను మూసి తెరిచేలోగా కాలం కాటువేసింది.
భీకరంగా బడబానలాలు రగిలించి
ఆ మహా ప్రళయంలో సమిధలైన
ఎన్నో జీవచ్ఛవాలు చేసే ఆర్తనాదాలు
ఆకాశాన్ని మిన్ను ముట్టాయి.
రాళ్ళల్లో రప్పల్లో మనిషి మనుగడనే
సమాధులు చేసింది.
మేడలు - మిద్దెలు, భవనాలన్నీ
ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి.
శిథిలాల కింద శవాల గుట్టలు
మృత్యువు మూకుమ్మడిగా హత్యలు చేసింది!
నాది నాదంటూ దాచినదంతా
చివరికేదీ దక్కకుండా
పుట్టేటపుడు పట్టుకురానివి
పోయేటపుడెందుకని
కూడబెట్టినదంతా కూకటివేళ్ళతో పెకిలించి
ఎవరికి ఎవరున్నారంటూ బంధాలన్నీ తెంచి
మట్టిలో పుట్టిన ప్రాణాల్ని మట్టిలోనే కలిపేసింది.
లక్షాధికారులు సైతం భిక్షాధికారులై
ఆకలితో అలమటించిపోతూ
సహాయంచేసే చేతుల కోసం ఆశగా చూస్తున్నాయి.
పాకిస్తాన్‌నే గడగడలాడించి భూ ప్రళయం
ఆక్రందనలతో రోదిస్తూ మరుభూమిగా మిగిలింది
కట్టుకొన్న ఆశలన్నీ కళ్ళెదుటే పేకమేడల్లా కూలి
బ్రతుకులు ఛిద్రమై భారంగా మిగిలాయి
మొన్న సునామీ, నిన్న భూ ప్రళయం.
నట్ట నడుమ వరదల్లో కొట్టుమిట్టాడుతూ
కాలం పగబట్టిన వేళ ఎవరికి విన్నవించుకోవాలి.
భూగర్భ పొరలను ఖనిజాల కోసం ఖననాలు చేసి
గుల్ల గుల్లగా తవ్వుతుంటే డొల్లుగాక మిగిలేముంది.
నేల తల్లి గుండెను బద్దలుచేస్తే క్షమిస్తుందా.
ఆగ్రహంతో శిక్షించక మానుతుందా!
బడబానలంలో లావాగ్ని రగలకముందే
మేలుకొంటే మంచిదని మరోసారి హెచ్చరించింది.

-తాటికోల పద్మావతి

తెలివైన మనిషావిడ. ఆ తెలివితేటలూ గాంభీర్యాల్లో ఏ కోశమూ మీ అమ్మమ్మకి రాలేదు. వాళ్ళింటి పడక్కు ర్చీలో కాలుమీద కాలేస్కుని షేక్స్పియర్ పొయెట్రీని, ఇంగ్లీషు నవలల్నీ ఊదిపారేసేది. సిగ్మండ్ ఫ్రాయిడ్ సైకాలజీ కూడా ఉండేదా యింట్లో. ఇప్పుడు మనింట్లో ఉన్న పుస్తకాల్లో సగానికి సగం ఆవిడవే.

మీ అమ్మమ్మకీ నాకు పెళ్ళి కావటానికి రెండేళ్ళ మునుపు ఏదో చిత్రమైన జబ్బుతో కాలం చేసిందావిడ. మా పెళ్ళయ్యాక ఆ లంకంత ఇంట్లో ఒక్కతీ ఇమడలేక మీ తాతత్త తన తమ్ముడింటి కెళ్ళిపోయింది.

మా పెళ్ళి దగ్గర్నుంచీ కూడ నేనూ మీ అమ్మమ్మా ఈ ఇంట్లోనే గడుపుతూ వచ్చేశాం. అప్పటికి ఈ ఊళ్ళో ఇప్పుడున్న రెండొందల గడప కూడా లేదు. మన పొలం దున్నే పాలేరు కుటుంబం, మంగలి తాత, ఎదుటి షావుకార్ల ఇల్లు - ఇలా ఓ పదిహేనిళ్ళుండేవి మొత్తంగా. చుట్టూ చిట్టడివి. పామునో తేలునో చంపని రోజంటూ లేదంటే నమ్మరు మీరు.

మీ అమ్మమ్మ సంగతి తెలుసు కదా? వాళ్ళ అక్కకి పూర్తి వ్యతిరేకం. పుస్తకాలు చదవదు. పూజలూ పున స్కారాలూను. ఇంటిపని తప్పితే మరో వ్యాపకం లేదు. నేను ఉదయం ఆరింటికి పొలానికి వెళ్తే, తిరిగి సాయం త్రం వరకు వచ్చేవాణ్ని కాదు. ఇంట్లో పాపం ఒక్కతే అలానే ఉండేది. ఓ ఏడాది దాకా - అంటే మీ పెద్ద మామ పుట్టేవరకు అలానే గడిచింది. ఇహ ఫర్లేదు, ఓ తోడు దొరికిందని ఆనందించాం.

ఓ రోజు సాయంత్రం ఇంటికొచ్చే సరికి మన ఇంటి వసారాలో ఓ పాతికమంది ఇపుడు మీరు కూర్చు న్నట్లే కూర్చొని ఉన్నారు. ఇపుడు నేను కూర్చున్నట్లుగా మీ అమ్మమ్మ పడక్కుర్చీలో కూర్చొని ఉంది. మీ మావయ్య అప్పటికి ఏడాది పిల్లడు. ఏం జరుగుతోందో తెలీక గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

నేన్రావటం చూసి, ఎవరిళ్ళకు వాళ్ళు జారుకు న్నారు. మెట్లెక్కి లోనికొస్తున్న నన్ను చూసి మీ అమ్మమ్మ ఏమందో తెలుసా?

"ఏవోఁయ్ గోపాలం! ఇదేనా రావటం?" అంది! నాకు మతిపోయింది. అప్పుడు చూశాను మీ అమ్మమ్మ చేతిలో ఇంగ్లీష్ పుస్తకం. కూర్చోటంలో కాలు మీద కాలేస్కున్న తీరు, పిలుపులోని ధాష్టీకం - అంతా, ముమ్మూర్తులా వాళ్ళక్కగారి తీరే! నాకేమనాలో తోచింది కాదు. స్వతహాగా నాకు దెయ్యాలూ ఆత్మలపైన నమ్మక

ముండేది గాదు.

పిల్లాడినెత్తుకుని లోన ఉయ్యాల్లో నిద్రపుచ్చి బైటకొచ్చా. ఇంకా అలానే కూర్చొని ఆ పుస్తకాన్ని తిరగేస్తోంది మీ అమ్మమ్మ.

"వంట వండాలి. ఇక లే" అన్నాను.

సూటిగా నావంకే చూసి, "నా చెల్లెలింట గూడా నేనే వంట చెయ్యాలటోయ్?" అని పుస్తకంలో తల దూర్చింది.

ఆ రాత్రికి ఇంటి పని, వంట పని, పిల్లాణ్ని సముదాయించే పనీ నాకే తగిలాయ్. ఆ మర్నాడే మీ తాతత్తకి ఉత్తరం రాసేశాను. ఐదార్రోజుల వంట తర్వాత ఆవిడ ఊర్లో దిగేరు. ఈ మధ్యలో ఆ పూనకం వదిలిద్దామని ఓసారి బిందెడు నీళ్ళు నెత్తిమీది నుంచి దిమ్మరించేశాను. అంతే! ఎర్రగా చూసి, "లెర్న్ మేనర్స్" అనేసి లోనికెళ్ళిపోయింది. అక్కణ్ణించి నాతో మాటాడ్డమే మానేసింది.

తాతత్త రాకతో నాకు వంట పని తప్పింది. అయితే, ఇంట్లో పిండి వంటలకి అడ్డూ ఆపూ లేకుండా పోయింది. రోజుకి రెండురకాల పిండి వంటలతో మీ అమ్మమ్మ సుష్టుగా తినేది. మరొకరైతే రెండింతల లావో, అజీర్తితో చిక్కి శల్యమో అయ్యుండేవారు. 'దెయ్యం తిండి' అంటారే, అలా తినేది.

ఇలా వారం గడిచేక ఓ రోజు గదిలో చంటాడ్ని ఊయల్లో ఊపుతుంటే నాకు బైట నుంచి తల్లీకూతుళ్ళ మాటలు వినిపించేయి-

"అమ్మా! ఇంక నే వెళ్ళొస్తానే" అంది మా ఆవిడ.

"అదేంటే? వచ్చి ఎన్నాళ్ళైందని? బ్రతికుండగా ఎలానూ నిన్ను చూళ్ళేను. కనీసం ఇలాగైనా చూసుకుంటున్నాను. ఐనా నీకిప్పుడు ఇక్కడ ఏం తక్కువైందని?" గద్గదంగా మీ తాతత్త.

"నాకూ ఉండాలనే ఉంది. కానీ మీ అల్లుడికి ఇష్టంలేదు. కష్టమల్లే ఉంది. ముఖం ముడ్చుకుని ఎట్లా ఉంటున్నాడో చూశావుగా?"

"నిజమేనే తల్లీ. పిసినారివాడాయె. నీకు వంటలు చేస్తుంటే డబ్బైపోతోందని మధనపడుతున్నాడల్లే ఉంది."

ఉరిమి ఉరిమి చివరకు నా నెత్తిన పడింది. కొంచెం సేపైనాక బైటచూస్తే పడక్కుర్చీలో సొమ్మసిల్లి పడి ఉంది మీ అమ్మమ్మ. మర్నాడు ఉదయం వరకు మనిషి స్పృహలోకి రాలేదు. వచ్చాక, బావురుమంది. ఎలాగోలా పూనకం వదిలినందుకు సంతోషించాను. కానీ మనిషి మాత్రం చిక్కి సగమైంది. తిరిగి మామూలు కావటానికి నెలరోజులు పట్టింది.

సరి, ఇహ ఫర్వాలేదు అని మా అత్తగారిని బయలు దేరదీసే సమయానికి మళ్ళీ ఆ మహాతల్లి పూనేసింది. ఇదే వరుసలో ఓ నాలుగుసార్లు పట్టువిడుపులయ్యేసరికి చిక్కి శల్యమైపోయి మహ దీనంగా తయారైంది మీ అమ్మమ్మ. నాకు భయం పట్టుకొంది. ఊరుకోలేక అడిగేశాను-

"ఏవఁమ్మా వదినా, మీ చెల్లెల్ని బ్రతుకనీయవా? చిక్కి ఎలా శల్యమైందో చూస్తున్నావా? మా మనిషిని దక్కించవమ్మా. తల్లి సాంగత్యం కరవై పిల్లాడు

## రేపటి సూర్యుడు

అదిగో నా చూపుల తీరాల్లో
ఉదయించే ఉషస్సు సాక్షిగా
రేపటి సూర్యుడు నీవే.
ఈ యావన్మానవ పొలాలన్నీ
(దు)న్నుతూ పో నీ నాగలి కాళ్ళకు
మానవత్వం తగిలే వరకూ.
కలలు నాటుతున్న 'కలాం' కలను
మేఘానివై తాగి వర్షించు
కాలం రెండు దశాబ్దాలపై
నీ పేరు రాస్తుంది.
దుర్మార్గాన్ని ధ్వంసం చేసే
బాంబులు నీ కండల్లో
నిదురిస్తున్నాయి వాటిని విసిరికొట్టు
అవి, 'నీతి పువ్వులై' విరబూస్తాయి.
నిస్సత్తువ ఆవరించిన చీకట్లలో
నీ శబ్దాల విద్యుత్తీగలతో వెలుగులు పూయించు
అదిగో చూడు
నీ అడుగుల్లో జన్మించడానికి నాగరికతలు
ఉబలాటపడుతున్నాయి
ఎగిరిపో నీ అడుగులు నాటుతూ
ఓ కొత్త యుగానికి
మళ్ళీ చెప్తున్నా ఓ 'యువతరం'
'రేపటి సూర్యుడు' నీవే.

-అమళ్ళదిన్నె భరద్వాజ

ఏమౌతాడో ఊహించావా?"

అప్పటికి ఎటూ తేల్చుకోలేక ఊరుకుందిగాని నేనలా అడిగేసరికి మీ తాతత్తకి నాపైన విపరీతమైన కోపం వచ్చింది. తన పెద్దకూతుర్ని తననుంచి విడదీసేస్తున్నానని బాధపడిపోయింది.

చూసి చూసి మా తమ్ముడికి కబురు పెట్టాను. వాడికిలాంటి విషయాల్లో ప్రవేశముంది. మాంఛి మంత్రవైద్యుడిగా పేరుమోశాడు. నాకందులో అనుమానం ఉండటంతో అన్నాళ్ళు తాత్సారం చేశాను.

మొత్తానికి వాడు మా ఇల్లు చేరాడు. వాడు వచ్చీ రాగానే మీ అమ్మమ్మ. "ఏవోయ్ ఇలా వచ్చావ్? నన్ను పంపించేయడానికే?" అని నవ్వింది.

మావాడు తీక్షణంగా చూసి, "వదినా! మర్యాదగా వదలిపో. పిల్లవాణ్ని చూశావా? నీ చెల్లెల్ని చూశావా? జాలి లేదూ నీకు?" అని అడిగాడు.

దానికావిడ ఎగతాళిగా నవ్వి, "నా చెల్లెలు, నా ఇష్టం. నువ్వెవడవయ్యా మధ్యన? తాను ఇన్ని సౌఖ్యాలను అనుభవిస్తుండగా నేను మాత్రం ఏం తక్కువ?" అని చేతిలోనున్న పుస్తకంలో లీనమైంది.

మావాడు నావైపు తిరిగి "అన్నయ్యా! ఇదిలా లొంగే ఘటం కాదు. నేనిప్పుడే వస్తానుండు" అని చెప్పి, మా ఆవిడతో, "వదినా! ఇదే ఆఖరుమాట. నేనొచ్చేలోపున విడచిపోకుంటే నీ గోళ్ళలో గోళ్ళుపెట్టి పొడిచేస్తా. నా గోళ్ళు చూశావా? ఎంతెంత ఉన్నాయో?" అని తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

మీ తాతత్త గుడ్ల నీరు కుక్కుకుంటూ "నా బిడ్డ నీకేమన్యాయం చేసింది నాయనా?" అని భోరుమంది.

"అమ్మా! నువ్వేడవకే. నేను మళ్ళీ వస్తాన్లేవే" అంటోంది మా ఆవిడ.

"నువ్వెక్కడికీ వెళ్ళొద్దే అమ్మా..."

"లేదే. అతగాడు అన్నంత పనీ చేస్తాడే. గోళ్ళు చూశావా?" అంటూ వీధి వైపే కోపంగా చూస్తూ కూర్చొంది.

మరో పావుగంటకి మావాడు చేతిలో తాయెత్తుతో తిరిగొచ్చాడు. గాట్ఠిగా నారసింహమంత్రం చదువుతూ ఆవిడ చేతికి కట్టేశాడు. నెమ్మదిగా మీ అమ్మమ్మ అలా కూర్చొనే నిద్రలోకి జారిపోయింది. తెలివొచ్చేసరికి మామూలు మనిషైంది.

ఆ తర్వాత మళ్ళీ తన పెద్దకూతురొస్తుందని మీ తాతత్త ఓ ఏడాదిపాటు ఇక్కడే ఉంది గాని ఫలితం లేకపోయింది. అటుపైన మీ అమ్మా, మామయ్యా పుట్టారు. మొత్తంమీద నేనన్నా, మా తమ్ముడన్నా మీ తాతత్తకి ఎక్కడలేని కోపమూను" అని ముగించేరు తాతగారు.

మేమంతా ఎవరి ఆలోచనల్లో వాళ్ళం పడ్డాం. నారదుడు బావ లేచి వంటింట్లోకి వెళ్ళిపోయాడు. వాడిపుడు నేను రమ్మన్నా, సినిమాకి రాడు.

"ఏరా? ఇప్పుడు కూడా దెయ్యాల్లేవంటారా?" అడిగారు తాతగారు.

"నేన్నమ్మనండీ. అమ్మమ్మది మానసిక బలహీనత. వాళ్ళక్కతో అన్నేళ్ళ సావాసం వల్ల అమ్మమ్మ మనసులో ఆవిడ ప్రతి కదలికా గుర్తుండిపోయి ఉంటుంది. అందుకే ఆవిడలాగ ప్రవర్తించింది. ఆ 'లెర్న్ మేనర్స్' అనే వాక్యం కూడ ఆవిడ దగ్గర విన్నదే అయి ఉంటుంది. అందుకే అలా అలవోకగా అనెయ్య గలిగింది." నాకు తెలిసినదంతా ఏకరువు పెట్టాను. "మీ పెళ్ళికి ముందు పెద్దమ్మమ్మ పోవటమూ, ఈ ఇంట్లో వంటరితనమూ, మీ గదిలోని పెద్దమ్మమ్మ పుస్తకాలూ అమ్మమ్మని ట్రాన్స్‌లోకి తీసికొనిపోయుంటాయి."

"మరి ఇంగ్లీషు బుక్సెలా చదివిందంటావు? చిన తాత చేసిన వైద్యం సంగతేంటి?" రెట్టించారు తాతగారు.

"దానిదేముంది? చినతాతగారు చేసినదంతా- కళ్ళలో కళ్ళు పెట్టి చూడటం, తాయెత్తు కట్టడం - ఇవన్నీ హిప్నాటిజంలోకి వస్తాయి" మా తమ్ముడు చెబుతుంటే మెచ్చుకోలుగా చూశారు తాతగారు. "కానీ.. ఆ ఇంగ్లీషెలా చదివిందో తెలీటంలేదు" అన్నాడు తమ్ముడు.

తాతగారు నవ్వేసి, "అదేం బ్రహ్మాండం కాదు. మీ అమ్మమ్మ ఒళ్ళో బుక్సయితే పెట్టుకొనేది కానీ పేజీలు మాత్రం తిరగేసేది. ముఖచిత్రాలూ, బొమ్మలూ లేని పుస్తకాలైతే తలకిందులుగా కూడా చదివేసేది" అన్నారు.

మా నవ్వులు విని వంటింట్లోంచి బైటకొచ్చి, నా ప్రక్కన చతికిలపడ్డాడు నారదుడు బావ. వాడ్ని చూస్తూ తాతగారు సీరియస్‌గా, "ఐతే ఇంతకీ సినిమాకి ఎవరెవరెళ్తున్నారు?" అన్నారు.

"అసలెళ్ళొచ్చే లేదో తెలీదు.. తాతయ్యా, ఇప్పుడు మాకా తాయిత్తులు దొరకవా?" అడిగాడు నారదుడు బావ.

■